సంక్షేమ పాలనకు మరోసారి మద్దతు

వార్డు ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారుల హవా

- మొత్తం 10 వార్డులకు ఉప ఎన్నికలు
- వైఎస్సార్ సీపీ మద్దతుదారులు ఏడు వార్డుల్లో ఏకగ్రీవం
- పోటీ చేసిన ఒక్క వార్డులోనూ వైఎస్సార్ సీపీ గెలుపు
- పోటీ చేసిన వార్డులో డిపాజిట్లు కూడా రాని టీడీపీ


గోరంట్ల ఏడో వార్డు మెంబర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై డిక్లరేషన్ పత్రం అందుకుంటున్న వైఎస్సార్ సీపీ మద్దతుదారుడు నందిగామ రవి


జూపల్లి మోషే


నందిగామ రవి


దివిదేవర జ్యోతి


శ్రీనివాసరావు


వాసా రత్నకుమారి


చందంశెట్టి శ్రీనివాసరావు


వల్లాల నాగరాజు


కంపసాటి సావిత్రి

సత్తెనపల్లి: పంచాయతీ వార్డు ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయదుందుభి మోగించింది. వైఎస్సార్ మద్దతు దారులను ఎన్నుకొని సంక్షేమ పాలనకు మరోసారి పట్టం కట్టారు. నియోజకవర్గంలో 10 గ్రామ పంచాయతీల్లో 10 వార్డు స్థానాల్లో ఎనిమిది వైఎస్సార్ సీపీ మద్దతుదారులు తమ హవా చాటుకున్నారు. మొత్తం 10 వార్డు సభ్యుల ఉప ఎన్నికలకు ఈనెల 6న ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయింది. 10 వార్డులకు గాను 9 వార్డుల్లో ఒక్కో నామినేషన్ దాఖలు కావడంతో ఎన్నికలు ఏకగ్రీవమైనట్టు ఎన్నికల రిటరి ్నంగ్ అధికారులు ప్రకటించి ఏకగ్రీవమైన అభ్యర్థులకు డిక్లరేషన్ పత్రాలు అందించారు. శనివారం ఒక వార్డు సభ్యుని ఎన్నిక జరిగింది. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం ఒంటిగంటకు ముగిసింది. అనంతరం అధికారులు ఓట్ల లెక్కింపు చేపట్టి సాయంత్రం ఫలితాలను ఎన్నికల అధికారులు ప్రకటించారు.

– నకరికల్లు మండలం గుండ్లపల్లి గ్రామంలోని ఐదో వార్డుకు చెందిన వార్డు మెంబర్ మారెళ్ళ ఆదిరెడ్డి అనారోగ్యం కారణంగా వార్డు మెంబర్ పదవికి రాజీనామా చేయడంతో ఈ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారుడు జూపల్లి మోషే, టీడీపీ

సత్తెనపల్లి నియోజకవర్గం	
ఎన్నికలు జరగాల్సిన వార్డులు	10
ఏకగ్రీవం అయిన వార్డులు	9
ఎన్నికలు జరిగిన వార్డులు	1
ఎన్నిక జరిగిన వార్డులో గెలుపు	వైఎస్సార్ సీపీ
ఏకగ్రీవంలో వైఎస్సార్ సీపీ	7

అభ్యర్థి కోవూరు పోతయ్య, టీడీపీ రెబల్ అభ్యర్థి పిల్లలు యూసఫ్ ముగ్గురు అభ్యర్థులు పోటీపడ్డారు. మొత్తం 534 మంది ఓటర్లు ఉండగా 301 ఓట్లు పోలయ్యాయి. వైఎస్సార్ సీపీ అభ్యర్థి జూపల్లి మోషేకు 287 ఓట్లు రాగా, ప్రత్యర్థి టీడీపీ అభ్యర్థి కొవ్వూరు పోతయ్యకు ఏడు ఓట్లు, టీడీపీ రెబల్ అభ్యర్థి యూసఫ్‌కు నాలుగు ఓట్లు వచ్చాయి. ఒక ఓటు నోటాకు పడగా రెండు ఓట్లు చెల్లలేదు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి జూపల్లి మోషే 280 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించి డిక్లరేషన్ పత్రం అందించారు. ఇక్కడ టీడీపీ కనీసం డిపాజిట్లు కూడా దక్కించుకోకపోవడం గమనార్హం. నియోజకవర్గంలో ఇక మిగిలిన 9 వార్డులు ఏకగ్రీవం కాగా వీటిలో ఏడు వైఎస్సార్ సీపీ, రెండు టీడీపీ దక్కించుకున్నాయి.

➡ సత్తెనపల్లి మండలం గోరంట్ల ఏడవ వార్డు మెంబర్ నందిగామ రమేష్ మృతి చెందడంతో ఉప ఎన్నిక నిర్వహించాల్సి వచ్చింది. ఆయన సోదరుడు నందిగామ రవి ఎన్నికల బరిలో నిలవడంతో ఇక్కడ ప్రత్యర్థి పోటీ చేయకపోవడంతో ఎన్నిక వైఎస్సార్ సీపీకి ఏకగ్రీవమైంది.

➡ లక్ష్మీపురం ఒకటో వార్డు మెంబర్ గోగినేని నిర్మల మృతిచెందడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఆమె కోడలు పోటీలో నిలవడంతో టీడీపీకి చెందిన గోగినేని లావణ్య ఏకగ్రీవంగా ఎన్నికైంది.

➡ భీమవరం తొమ్మిదవ వార్డు మెంబర్ బండారు చిన్న నాగేశ్వరరావు మృతి చెందడంతో ఆయన సోదరుడు టీడీపీకి చెందిన బండారు శ్రీను ప్రస్తుతం ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు.

➡ ముప్పాళ్ళ మండలం రుద్రవరం ఏడవ వార్డు మెంబర్ దివి దేవర వెంకట శివ విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. దీంతో ఆయన భార్య వైఎస్సార్ సీపీ మద్దతు దారురాలు దివిదేవర జ్యోతి ఎన్నికల్లో నిలబడటంతో ఎన్నిక ఏకగ్రీవం అయింది.

➡ మాదల ఆరో వార్డు మెంబర్ సుంకర వెంకటేశ్వర్లు కరోనా సమయంలో మృతి చెందాడు. ఈ వార్డుకు వైఎస్సార్ సీపీ కి చెందిన చిమటా శ్రీనివాసరావు ఒక్కడే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది.

➡ రాజుపాలెం మండలం బ్రాహ్మణపల్లి ఐదవ వార్డ్ మెంబర్ వాసా కోటేశ్వరమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఆమె మరదలు వైఎస్సార్ సీపీ మద్దతు దారులు వాసా రత్నకుమారి ఏకగ్రీవమైంది.

➡ అనుపాలెం(కుబాద్‌పురం) ఎనిమిదో వార్డు మెంబర్ గాలి చంద్రశేఖరరావు మృతి చెందడంతో ఆయన బావమరిది వైఎస్సార్ సీపీ మద్దతు దారుడు చందంశెట్టి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు.

➡ చౌటపాపాయపాలెం ఒకటో వార్డు మెంబర్ వల్లాల లక్ష్మణరావు చనిపోవడం వల్ల ఆయన తమ్ముడు వైఎస్సార్ సీపీ మద్దతుదారుడు వల్లాల నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు.

➡ కొత్త భోధనం రెండో వార్డు మెంబర్ కంపసాటి లక్ష్మీ తిరుపతమ్మ మృతి చెందడంతో ఆమె చెల్లెలు వైఎస్సార్ సీపీ మద్దతుదారురాలు కంపసాటి సావిత్రి ఏకగ్రీవంగా ఎన్నిక యింది.

క్లుప్తంగా

విజేతకు ఎమ్మెల్యే శంకరరావు అభినందనలు



క్రోసూరు: మండలంలోని హసనాబాద్ గ్రామం 3వ వార్డుకు శనివారం జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి షేక్ క్రోసూరు సైదాబీ 31 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈసందర్భంగా క్రోసూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావును ఆమె కలుసుకున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే నంబూరు శంకరరావుల ఆశీస్సులతో తాను గెలుపొందినట్లు సైదాబీ చెప్పారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అండగా నిలవాలని, ప్రజలకు సేవ చేయటంలో మంచి తెచ్చుకోవాలంటూ సైదాబీకి సూచించి, అభినందించారు. గ్రామ సర్పంచ్ షేక్ అబ్దుల్ రహీం, పార్టీ నాయకులు షేక్ ముస్తఫా, గ్రామ అధ్యక్షుడు రెడ్డిగూడెం మస్తాన్‌వలి, ఉప సర్పంచ్ చిన్నవీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ తల్లికి బోనాలు



రాజుపాలెం: మండలంలోని అనుపాలెం గ్రామంలో శ్రావణ మాసంలో ముత్యాలమ్మ తల్లికి మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించారు. ఆదివారం మహిళలు పొంగళ్లు పొంగించి బోనాలు నెత్తిన పెట్టుకుని గ్రామంలో బ్యాండ్ వాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి బోణాలు సమర్పించారు. ప్రతీ ఏడాది శ్రావణ మాసంలో వచ్చే మొదటి ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా మహిళా భక్తులు నిర్వహిస్తారు.

అబాకస్ పోటీల విజేతకు సత్కారం



సత్తెనపల్లి: అబాకస్ పోటీలలో మూడు జిల్లాలలో మొదటి ర్యాంకు సాధించిన పట్టణానికి చెందిన రెడ్డి కృష్ణ వికాస్‌ను పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఆత్మకూరి వెంకట హరే రామ చెంచయ్య ఆధ్వర్యంలో పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థాన కల్యాణ మండపంలో ఆదివారం అభినందన పూర్వక సత్కారం నిర్వహించారు. హరే రామ చెంచయ్య మాట్లాడుతూ కృష్ణ వికాస్ వీవీ అబాకస్ పోటీలలో మూడు జిల్లాలలో మొదటి ర్యాంకు సాధించడం గొప్ప విషయమన్నారు. భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పూలమాలలు, దుశ్శాలువాలతో కృష్ణ వికాస్‌ను సత్కరించారు. ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షుడు సింగరి మధుసూదనరావు, ఆర్యవైశ్య సంఘ నాయకులు కట్టమూరి అప్పారావు, కాపుగంటి రత్తయ్య, దివ్వెల శ్రీనివాసరావు, కొత్తూరి విశ్వేశ్వరరావు, పోతుగంటి నరసింహారావు, రెడ్డి శ్రీనివాసరావు, కోట వెంకట బసవయ్య, కుంచనపల్లి శ్రీనివాసరావు, ఎక్కల సుబ్బారావు, హిందీ ఉపాధ్యాయుడు వాసిరెడ్డి ప్రసాదరావు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

సత్తెనపల్లి: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ కార్యాలయంలో సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి చుక్క చంద్రపాల్ రాజీవ్ గాంధీ చిత్రపటానికి, మున్సిపల్ కార్యాలయం, రైల్వే స్టేషన్ దగ్గర ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఘనంగా పైడమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం



ముప్పాళ్ళ: మండల కేంద్రమైన ముప్పాళ్లలోని పైడమ్మతల్లి వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా గ్రామం సుఖశాంతులతో పాటుగా పాడి, పంట సమృద్ధిగా ఉండేలా చూడాలంటూ నీటి బిందెలతో మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలు, నిర్వహించారు. భక్తులు పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

గ్రామదేవతలకు జలాభిషేకం

క్రోసూరు: క్రోసూరు పట్టణ ప్రజలు, రైతులు వర్షాభావ పరిస్థితుల నుంచి కాపాడాలని, గ్రామ దేవతలు కరుణించి వర్షాలు ఇవ్వాలని కోరుతూ మూడురోజులుగా జలాభిషేకాలు చేశారు. ఆదివారం గ్రామ పొంగళ్లు నిర్వహించారు. కృష్ణానది నుంచి నీళ్లను తీసుకొచ్చి గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తూ గ్రామదేవతలు పోలేరమ్మతల్లి, మహాలక్ష్మమ్మ తల్లి, మద్దిరాలమ్మ తల్లి, పాటికోటమ్మతల్లి, బొడ్రాయి లకు జలాభిషేకాలు నిర్వహించారు. భక్తులు అశేషంగా పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత ప్రచారం

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు, కుందురువారిపాలెం, ముప్పాళ్ళ గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా భగవద్గీత సారాంశమును వివరిస్తూ గ్రామంలో ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంతం-ప్రభోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక, చిలకలూరిపేట కమిటీ అధ్యక్షుడు యద్దనపూడి వీరాంజనేయులు పాల్గొన్నారు.

అధికారం కోసం పార్టీలు మారలేదు

- పవన్ కల్యాణ్‌లా అమ్ముడు పోలేదు
- విశ్వాసంతో వైఎస్సార్ కుటుంబం వెంట నడుస్తున్నాను
- ఈ నెల 22న జరిగే బీసీ గర్జనతో సత్తెనపల్లిలో ఎన్నికల శంఖారావం
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: అధికారం కోసం కన్నా లక్ష్మీనారాయణ లాగా పార్టీలు మారలేదని, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లా అమ్ముడు పోలేదని, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడులా మోసాలు చేయలేదని, విశ్వాసంతో నాడు వైఎస్ రాజశేఖర రెడ్డిని – నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నమ్ముకొని వారి వెంట నడుస్తున్నానని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మున్సిపల్ కౌన్సిలర్లు, ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశానికి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన బహుజన వర్గాల సమక్షంలో జరిగే బీసీ గర్జనతో ఎన్నికల సమర శంఖారావం పూరిస్తున్నామన్నారు. ఆసియా ఖండంలోనే అతిపెద్దదైన గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్‌గా నియమితులైన నిమ్మకాయల రాజనారాయణకు, విద్యాభివృద్ధి మౌలిక వసతుల కల్పన కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన యనమల నాగార్జున యాదవ్‌కు జరుగుతున్న సన్మాన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మాజీ శాసన సభ్యుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నా పేద బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉండేందుకు యువ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్నారని వివరించారు. పారదర్శకంగా అందిస్తున్న సంక్షేమాన్ని భవిష్యత్తులో కొనసాగించు కోవాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. బీసీలకు రాజకీయ ప్రాధాన్యత అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఆయా సామాజిక వర్గాలు అండగా ఉండాలని కోరారు. పార్టీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇద్దరు బీసీ నాయకులకు రాష్ట్రస్థాయి పదవులు ఇవ్వటం అంటే సత్తెనపల్లి నియోజకవర్గంతో పాటు బీసీ సామాజిక వర్గానికి సన్మానంగా భావించాలని వివరించారు. నిమ్మకాయల రాజనారాయణ, యనమల నాగార్జున యాదవులను ఘనంగా సన్మానించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. సమావేశంలో 'మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ సహారా మౌలాలి, సత్తెనపల్లి మండల పార్టీ కన్వీనర్ రాయపాటి పురుషోత్తమరావు, రాష్ట్ర రైతు సలహా మండలి సభ్యులు కళ్ళం విజయ భాస్కర్ రెడ్డి, ఏంజెల్ లింగారెడ్డి, నక్క శ్రీను, రెండెద్దుల వేంకటేశ్వర రెడ్డి,పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, శిరిగిరి గోపాలరావు, కట్టా సాంబయ్య ,ఎస్సీ సెల్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు చిలక జైపాల్, డేవిడ్ రాజు, ధూళిపాళ్ల ది ఆంధ్రా బ్యాంక్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ నలబోతు శివన్నారాయణ, పట్టణ కౌన్సిలర్లు, పలువురు నాయకులు, బీసీ సంఘాల నేతలు, తదితరులు ఉన్నారు.

రెండు నెలల్లో పెద్దమద్దూరు బ్రిడ్జిని ప్రారంభిస్తాం


బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: మండల పరిధిలోని పెద్దమద్దూరు వద్ద హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులను ఆదివారం పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ అమరావతి నుంచి తుళ్లూరు డబుల్‌రోడ్డు నిర్మాణం, పెద్ద మద్దూరు వద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం అత్యవసరమని భావించిన జగనన్న ప్రభుత్వం రూ.44 కోట్ల నిధులను అర్అండ్‌బీ శాఖ ద్వారా నిధులను మంజూరు చేయటంతో పనులు మొదలుపెట్టామన్నారు. ఈ బ్రిడ్జికి కావాల్సిన 5 ప్రధాన పిల్లర్లలో 4 పూర్తయ్యాయని ఐదో పిల్లర్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. మిగిలిన పనులు త్వరగా పూర్తిచేసి రెండు నెలల్లో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి ప్రారంభిస్తామన్నారు. ఈసందర్భంగా పనులు మరింత వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌లను, ఆర్‌అండ్‌బీ అధికారులను ఎమ్మెల్యే శంకరరావు ఆదేశించారు.

అన్నివర్గాలకు సమాన ప్రాధాన్యం



టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన వారితో మంత్రి అంబటి రాంబాబు, పక్కన మాజీ ఎమ్మెల్యే యర్రం, నాయకులు

- వైఎస్సార్ సీపీలో చేరిన 50 మంది టీడీపీ కార్యకర్తలు
- సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువాలు కప్పిన మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: అన్ని కులాలకు, మతాలకు, వర్గాలకు, రాజకీయాలకు అతీతంగా అందరికీ సమాన ప్రాధాన్యతను, ప్రాముఖ్యతను అందిస్తున్న ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం 18వ వార్డుకు చెందిన వార్డు నాయకుడు తోట వెంకటేశ్వర్లు, మాదల నాయకుడు సైదాల ఆధ్వర్యంలో 50 మంది తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. వారిని మంత్రి అంబటి రాంబాబు సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువాలు కప్పారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి మాట్లాడుతూ మీకు మేలు జరిగితేనే ఓటు వేయండని ధైర్యంగా చెబుతున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ముస్లిం మైనార్టీ సామాజిక వర్గాలకు ఈ ప్రభుత్వం, పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని వివరించారు. మాజీ శాసనసభ్యుడు యర్రం వెంకటేశ్వర రెడ్డి నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబులు మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాం నుంచి ముస్లింలు వైఎస్సార్ కుటుంబానికి అండగా ఉన్నారని, ముస్లిం మైనారిటీలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత దివంగత మహానేత వైఎస్సార్‌కే దక్కిందని వివరించారు. ఈ సందర్భంగా ఎస్‌కే సుభాని, ఖాదర్ వలీ, పీర్ బుడే, గన్ సైదా, తదితర కార్యకర్తలను పార్టీలోకి సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువాలను కప్పి స్వాగతించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగూర్ మీరాన్, మున్సిపల్ కో-ఆప్షన్ మెంబర్ సహారా మౌలాలి, గని, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కట్టా సాంబయ్య, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపునకు సమష్టిగా కృషి చేయాలి..

సత్తెనపల్లి: నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు ఊపందుకున్నాయి. ఆదివారం పట్టణంలోని 23వ వార్డులో సయ్యద్ జిలాని వర్గం పార్టీలో చేరింది. జిలాని నివాసంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు స్వయంగా వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ పార్టీలో స్థానికంగా ఉన్న వైఎస్సార్ సీపీ నాయకులను సమన్వయం చేసుకొని క్షేత్రస్థాయిలో వార్డు అభివృద్ధికి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ అండగా ఉంటుందని వివరించారు. మాజీ శాసనసభ్యుడు యర్రం వెంకటేశ్వర రెడ్డి, నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, వైస్ చైర్మన్ షేక్ నాగూర్ మీరాన్, మున్సిపల్ కో-ఆప్షన్ మెంబర్ సహారా మౌలాలి, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, స్థానిక నాయకులు ఉన్నారు.

పీడీఎం సభను జయప్రదం చేయండి


కరపత్రాలు విడుదల చేస్తున్న పీడీఎం, ప్రజాసంఘాల నాయకులు

నకరికల్లు: పీడీఎం రాష్ట్ర నాయకుడు కనకాచారి వర్ధంతిని ఈనెల 24న గుంటూరులో నిర్వహించనున్నట్లు ఆసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోపిడీ విధానాలను ప్రశ్నిస్తూ పేదప్రజల పక్షాన నిలిచి హతుడైన కనకాచారిని స్మరించుకుంటూ మణిపూర్‌లో జరుగుతున్న పరిణామాలపై వాస్తవాలను చర్చించే సభ జరుగుతుందన్నారు. వక్తలుగా విరసం నాయకులు సీఎస్ఆర్ ప్రసాద్, సీఎల్‌సీ నాయకులు డాక్టర్ రాజారావు, పీడీఎం సీనియర్ నాయకులు వై.వి.ప్రసంగిస్తారన్నారు. కార్యక్రమంలో పీడీఎం సీనియర్ నాయకులు వై.వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు షేక్.మస్తాన్‌వలి, కార్యదర్శి జి.రామకృష్ణ, లాలూ, గిరిజనసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.కోటానాయక్, మాలమహానాడు సోషల్‌మీడియా ఇన్‌చార్జి గోదాబాల, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి షేక్.సైదా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



సత్తెనపల్లి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గృహం పూర్తిగా దగ్ధమైన సంఘటన పట్టణంలోని 6వ వార్డులోని భీమవరం డొంకరోడ్డులో ఆదివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. భీమవరం డొంక రోడ్డులో నివసిస్తున్న సయ్యద్ జాన్ సైదా పెంకుటింటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలు ఆర్పివేశారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. గృహంలో ఉన్న బీరువా, విలువైన పత్రాలు, సామగ్రి, దుస్తులు మొత్తం అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.2 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు అంచనా. ఆరో వార్డు కౌన్సిలర్ సదనం సత్యవాణి, హరి మిత్రమండలి అధ్యక్షుడు సదనం హరి, మిత్ర బృందం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు.

దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


రాజుపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


సత్తెనపల్లిలో డాక్టర్ రోనాల్డ్ రాస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైద్య, సచివాలయ సిబ్బంది

రాజుపాలెం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలు వ్యాప్తిచెందకుండా ఉంటాయని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి కేవీ కృష్ణకుమార్ తెలిపారు. మండలకేంద్రంలోని రాజుపాలెంలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆరోగ్య సిబ్బంది ఆదివారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ దోమ కాటు వలన వచ్చే వ్యాధులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, దోమలు కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. నినాదాలు చేసుకుంటూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్‌లు జీవన్ రావు, ఉషారాణి, గ్లోరీ, ఆరోగ్య సిబ్బంది థామస్, కోటేశ్వరరావు, రమాదేవి, శివాంజనేయులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే దోమల నివారణ సాధ్యం ..

సత్తెనపల్లి: ప్రజల భాగస్వామ్యంతోనే దోమల నివారణ సాధ్యమని పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి సీహెచ్ ప్రభాకర్ రెడ్డి అన్నారు. ప్రపంచ మలేరియా డే సందర్భంగా ఆదివారం సత్తెనపల్లి పట్టణ మలేరియా సబ్ యూనిట్ ఆధ్వర్యంలో పట్టణంలోని మూడు అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యులు, హెల్త్ సెక్రటరీస్, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, మలేరియా సిబ్బందితో 13వ సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వడ్డవల్లి పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ షేక్ మహబూబ్, మార్కెట్ యార్డు పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ జి.ధర్మ సింగ్ శాస్త్రి మాట్లాడారు. ఈ సందర్భంగా 1897లో ఇన్‌ఫెక్టెడ్ ఆడ ఎనాలఫిస్ దోమ కాటు ద్వారానే మనిషి నుంచి మనిషికి మలేరియా వ్యాధి వాపిస్తోందని తన పరిశోధనలో కనుగొన్న బ్రిటిష్ శాస్త్రవేత్త సర్ డాక్టర్ రోనాల్డ్ రాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజలందరికీ దోమల ద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన కల్పిస్తామని, ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడంలో తమ వంతు పాత్ర పోషిస్తామని, వైద్య ఆరోగ్యశాఖ పురోగమనానికి పాటుపడడమే కాక ప్రజాభ్యున్నతికి ఎనలేని వైద్య ఆరోగ్య సేవలు అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు. మార్కెట్ యార్డ్ హెచ్‌వీ ప్రేమలత, పట్టణ మలేరియా సబ్‌యూనిట్ హెల్త్ సూపర్‌వైజర్ వై.రాజేష్ పాల్, హెల్త్ అసిస్టెంట్స్ ఎంపీ కిరణ్‌బాబు, ఎస్ఎం హుస్సేన్, షేక్ షరీఫ్, 13వ సచివాలయం అడ్మిన్ షేక్ కరిముల్లా, హెల్త్ సెక్రటరీలు, ఆశా కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది, పాల్గొన్నారు.

పాత కక్షల నేపథ్యంలో ఘర్షణ

ఇద్దరికి గాయాలు

నాదెండ్ల: చందవరంలో పాతకక్షల నేపథ్యంలో ఆదివారం ఉదయం రెండు గ్రూపుల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామానికి చెందిన గొంటు శ్రీనివాసరెడ్డి, ఆయన మేనమామ చేరెడ్డి కృష్ణారెడ్డి, అదే గ్రామానికి చెందిన గొంటు జయభాస్కరరెడ్డికి ఆస్తి తగాదాలున్నాయి.

ఈ క్రమంలో ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో చేరెడ్డి కృష్ణారెడ్డి బైక్‌పై వెళ్తుండగా, జయభాస్కరరెడ్డి ట్రాక్టర్‌తో ఢీకొన్నాడు. అంతటితో ఆగకుండా గొడ్డలితో దాడి చేయబోగా, కృష్ణారెడ్డి తప్పించుకున్నాడు. ఆయన సోదరుడైన గొంటు శ్రీనివాసరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని వారించాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్యా ఘర్షణ చోటు చేసుకోగా జయభాస్కరరెడ్డి ఆవేశంతో శ్రీనివాసరెడ్డిపై దాడి చేశాడు. దీంతో గాయాలపాలైన కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డిలను కుటుంబ సభ్యులు నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘర్షణపై ఇరు వర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.